క్లుప్తంగా

'అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి'

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో డీటీడీవో రమాదేవితో కలిసి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న కొలాం విద్యార్థుల ఆధార్ కార్డులు అప్‌డేట్ చేస్తూ ఫోన్ నంబర్ల అనుసంధానం ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఆధార్ కార్డు లేని విద్యార్థులకు ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలో అదనపు గదులు, కరెంట్, మరుగుదొడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఏసీఎంవో ఉద్ధవ్, హెచ్‌ఎం, వార్డెన్, ఏటీడీవోలు పాల్గొన్నారు.

మోడల్‌స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న సీట్లకు 8వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 6 సీట్లు, 7, 8వ తరగతుల్లో రెండు, 9వ తరగతిలో మూడు సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. హాజరయ్యే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఆసిఫాబాద్ మండలం స్థానికులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఎస్సై బదిలీ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో డీఎస్‌బీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణ రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు కాళేశ్వరం జోన్-1 డిప్యూటీ ఐజీ పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గుట్కా పట్టివేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఆదిలాబాద్ క్రాస్‌రోడ్డు వద్ద శనివారం రూ.3.56లక్షలు విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఆసిఫాబాద్ సీఐ సతీశ్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. వచ్చిన సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేపట్టామని తెలిపారు. అనుమానంతో ఓ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో నిషేధిత ఉత్పత్తులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని ఉట్నూర్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ షక్ ఆసిఫ్, షేక్ ఇర్షాద్, బుక్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అర్బజ్, కాగజ్‌నగర్‌కు చెందిన షేక్ ఇమ్తియాజ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకున్న ఆసిఫాబాద్ సీఐ సతీశ్, ఎస్సై ప్రవీణ్, ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఏఎస్సై బోజగౌడ్, హెచ్‌సీ దత్తు, పీసీ శేషగిరిరావ్, సమాచారం ఇచ్చిన వాంకిడి, కెరమెరి ఎస్సై విజయ్‌ని ఎస్పీ అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి, గ్రామ స్థాయి సమస్యలు ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరవ్వాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పలకల పంపిణీ

తిర్యాణి: మండలంలోని పంగిడిమాదర, చింతలమాదర, పెందూర్‌గూడలోని ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు అనిల్ అన్న యువసైన్యం ఫౌండేషన్ సభ్యులు పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏకో టూరిజం కమిటీ చైర్మన్ తుంరం గోపాల్ మాట్లాడుతూ సేవా ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సేవా ధృక్పథం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న కార్తీక్

వాంకిడి: మండలంలోని ఖైరిట్ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ యూత్ సర్వేలో భాగంగా శనివారం మండలంలోని ఖైరిట్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువతతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామానికి రోడ్డు, ఒర్రెపై వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డుతో పాటు అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. మండల అధ్యక్షుడు నిఖిల్, యువకులు భూపేశ్, ప్రభాకర్, వివేక్, కోటేశ్వర్ పాల్గొన్నారు.

పొగచూరుతున్న వంట బతుకులు

- మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల ఇబ్బందులు
- మూలనపడ్డ గ్యాస్ పొయ్యిలు
- ఇరుకు గదుల్లోనే వంట



పొగతో ఇబ్బందులు పడుతున్న నిర్వాహకురాలు

చింతలమానెపల్లి: మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు వంట చేయడానికి నానా అవస్థలకు గురవుతున్నారు. వసతులు లేక నిర్వాహకులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వం వీరి కోసం ప్రవేశ పెడుతున్న పథకాలు అమలుకు నోచుకోక ఉపాధికోసం తప్పనిసరి పరిస్థితిలో అసౌకర్యాలతోనే వంట చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మొత్తంగా 52 ఉన్నాయి. వీటిలో సుమారుగా 160 మంది మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్నారు. కౌటాల మండలంలో 55 పాఠశాలలకు గాను సుమారు 170 మంది విద్యార్థులకు వంట నిర్వహిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

కౌటాల, చింతలమానెపల్లి మండలాలలో కొన్నేళ్ల క్రితం వంట నిర్వహణకు గ్యాస్ పొయ్యిలు మంజూరయ్యాయి. కాగా ఇవి నాసిరకంగా ఉండడంతో ప్రారంభంలోనే సరిగ్గా పని చేయక నిర్వాహకులు వినియోగించడం నిలిపివేశారు. దీనితో పాటు ఈ గ్యాస్ పొయ్యిలు, ఆయా సంఘాల ఏజెన్సీల పేరుతో ఉండడం, ఈ గ్యాస్ పొయ్యిల సబ్సిడీ ఏజెన్సీల ఖాతాలలోకి వెళ్లడంతో నిర్వాహకులు గ్యాసు పొయ్యిల వినియోగానికి ఆసక్తి చూపలేదు. దీంతో ఆయా పాఠశాలలకు మంజూరైన గ్యాస్ పొయ్యిలు గదుల్లో కూరగాయలు, సామాన్లు ఉంచేందుకు వినియోగిస్తున్నారు. మరో వైపు ఆయా పాఠశాలలకు వంట నిర్వహణకు గదులు మంజూరయ్యాయి. ఉమ్మడి మండలంగా ఉన్నప్పుడు మంజూరైన గదులకు బిల్లులు సరిగా రాకపోవడంతో గుత్తేదార్లు గదుల నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు.

ఇబ్బందుల్లో నిర్వాహకులు..

గ్యాస్ పొయ్యిలు లేక వంట నిర్వహించడానికి సరైన గదులు లేక వంట నిర్వాహకులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని రుద్రాపూర్, ఖర్జెల్లి, దిందా, డబ్బా, తదితర పాఠశాలల్లో శిథిల భవనాలలో వంట నిర్వహిస్తున్నారు. రెండు మండలాలలో వంట గదుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఈక్రమంలో గాలి ఆడని గదుల్లో వంట నిర్వహించడం కత్తిమీద సాములా ఉంటోందని నిర్వాహకులు వాపోతున్నారు. పొగతో నిండి ఉన్న గదుల్లో వంట చేస్తుండడంతో తమ ఆరోగ్యం చెడిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల్లోని శిథిలమయ్యే గదుల్లో వంట నిర్వహిస్తున్నామని వంట సామాను ఉంచేందుకు కూడా సరైన వసతి లేదని వాపోతున్నారు. మరోవైపు వంట నిర్వహణ కోసం గ్యాస్ పొయ్యిలు లేక వంట చేయడం కష్టంగా మారిందని వారు తెలియజేస్తున్నారు. వంట చెరుకు లభించకపోవడంతో అధిక ధరలకు వంట చెరుకు కొంటున్నామని నిర్వాహక మహిళలు తెలిపారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్..

మధ్యాహ్న భోజన పథకంలో వంట సజావుగా నిర్వహించేందుకు అధికారులు, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు. గ్యాస్ పొయ్యిలను ప్రభుత్వం సరఫరా చేయాలని సబ్సిడీని ఏజెన్సీల పేరిట కాకుండా గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో గ్యాస్‌కు అయ్యే ఖర్చును ప్రభుత్వమే నిర్వాహకులకు నేరుగా అందించాలని కోరుతున్నారు. అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో ఆయా పాఠశాలలకు వెంటనే వంట గదులను అన్ని వసతులతో ఇవ్వాల్సిన అవసరం ఉంది. నీటి సౌకర్యం, వంట పాత్రలను శుభ్రం చేసుకునేందుకు వీలుగా గదులను నిర్మించాలని, వంట సామాను భద్రపరుచుకునేలా సౌకర్యాలు ఉండాలని నిర్వాహకులు కోరుతున్నారు.

గుడ్లబోరిలో జ్వరం పంజా

- మంచం పట్టిన గ్రామస్తులు



జ్వరంతో బాధపడుతున్న బాలుడు

కౌటాల: గ్రామాల్లో భారీ వర్షాలు కురవక ముందే ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో గత వారం రోజులుగా ప్రజలు తీవ్ర జ్వరాలతో మంచం పట్టారు. గ్రామంలోని బీసీ కాలనీలో 60 మందికి పైగా జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. జ్వరం తీవ్రత మూడు, నాలుగు రోజులు ఉన్నా.. ఒళ్లు, కీళ్ల నొప్పులు మాత్రం తగ్గడం లేదని స్థానికులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షాలకే గ్రామంలోని డ్రెయినేజీ కాలువల్లో మురికినీరు నిలుస్తోందని, దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెందడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఒకేసారి పదుల సంఖ్యలో ప్రజలు జ్వరం బారిన పడడంతో స్థానిక ఆర్ఎంపీలు ఇదే అదునుగా ఇష్టారీతిన వైద్యం చేస్తున్నారు. దీంతో జ్వర బాధితులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రి సీతక్కను కలిసిన ఎస్పీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్: జిల్లా ఎస్పీ డి.వి శ్రీనివాస రావు శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా పరిస్థితులను మంత్రికి వివరించారు.

వోల్వో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న వోల్వో ఉచిత డ్రైవింగ్ శిక్షణకు ఆసక్తి గల యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించి హెవీ గూడ్స్ వెహికల్ లైసెన్స్ కలిగి డ్రైవింగ్‌లో కనీసం మూడేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు ఉండి ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 11వ తేదీ లోగా ఎంవీటీసీలో నేరుగా దరఖాస్తులు అందించాలని కోరారు. సింగరేణి ప్రభావిత, పునరావాస గ్రామాల నిరుద్యోగ యువకులు, కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో శనివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మాట్లాడుతూ జగ్జీవన్‌రాం దేశానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కలికోట రమణయ్య, మార్త ఉపేందర్, ఎల్లాగౌడ్, నాగేశ్వర్‌రావు, పురుషోత్తం, సీతారాం, కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలో శనివారం బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పార్ల వెంకటేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్‌రాం ఎంతో కృషి చేశారన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఓవర్‌లోడ్‌తో విద్యార్థులను ఎక్కిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని డీటీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ రజితకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నడుపుతున్న బస్సులు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించకుండా ఫిట్‌నెస్ లేని వాహనాలు సైతం నడుస్తున్నాయన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రసాద్, తిరుపతి, రాహుల్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని బజార్‌వాడీకి చెందిన రాపర్తి నారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఇంట్లో తనిఖీ చేయగా, 9 బ్యాగుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.10 వేల వరకు ఉంటుందని తెలిపారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపైన వెళ్లిన ఉపాధ్యాయులు సుజాత, నగేశ్, శ్రీధర్, రమాదేవి, కళావతి, విజయ్‌లకు శనివారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం విజయ నిర్మల మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన ఉపాధ్యాయులు పదోన్నతిపైన మరో పాఠశాలకు వెళ్లడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాతో సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, గంగాభవాని, లక్ష్మీ, భారతి, ఆత్మరామ్, సంతోష్, సాదియా తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శనివారం మండలంలోని బాబాపూర్ తేలివాడ ప్రభుత్వ పాఠశాలలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గత 15 సంవత్సరాలుగా పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న తంగెడిపెల్లి రమేశ్, వెంకట్రావు, ప్రవీణ్, బాదిరావు, ధన్‌రాజ్‌లను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారి సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాథోడ్ సుభాష్, గ్రామస్తులు బలరాం, నాందేవ్, లక్ష్మణ్, శ్రావణ్, వకులాదేవి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం పరిశీలన



మెడికల్ క్యాంపు పరిశీలిస్తున్న నరేందర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని శనివారం ఏరియా ఇన్‌చార్జి జీఎం నరేందర్ పరిశీలించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి యాజమాన్యం మెడికల్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తోందని తెలిపారు. దీంతో ప్రతీ ఉద్యోగి హెల్త్ రిపోర్టు సంస్థ వద్ద ఉంటుందని పేర్కొన్నారు. ఏరియాలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులంతా తప్పనిసరిగా మెడికల్ స్క్రీనింగ్‌కు హాజరు కావాలని సూచించారు. పీవో సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ తిరుపతి, డీవైపీఎం వేణు, డిస్పెన్సరీ సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఆదివారం ఉదయం 11 గంటలకు జనరల్‌బాడీ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పెండింగ్ పీఆర్సీ, డీఏ, డీఆర్, విశ్రాంత ఉద్యోగులకు పూర్తి ఉచిత వైద్యంతోపాటు పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లాలో విశ్రాంత ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల విరాళం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ద్వారకానగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో 2003 -04 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రెండు కంప్యూటర్లను పాఠశాలకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పర్వతి రాజశేఖర్, ప్రతాప్, సందీప్, సతీశ్, శ్రీనాథ్, లక్ష్మి, ప్రసన్న, స్వాతి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

మహర్ల సమస్యలు పరిష్కరించాలి



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మహర్ కులస్తుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నేతకాని (మహర్) జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహర్లకు ఆదివాసీలతో పాటు పోడు పట్టాలు అందించాలన్నారు. నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహర్ సంఘం బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బసర్కార్ విశ్వనాథ్, నాయకులు దాగం ఆగయ్య, పత్రు, శంకర్, ఏమాజీ, చంద్రశేఖర్, అశోక్, కిశోర్, విఠల్ పాల్గొన్నారు.

మహిళల రక్షణ, అభివృద్ధికి మిషన్ శక్తి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి యువరాజు

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలు, యువతులు, బాలికల రక్షణ, అభివృద్ధికి మిషన్‌శక్తి ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ న్యాయమూర్తి యువరాజు పేర్కొన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సంక్షేమాధికారి భాస్కర్, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారదతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కెరీర్ గైడెన్స్, సైబర్‌క్రైమ్, మాదకద్రవ్యాల నిర్మూలన, సోషల్ మీడియా నుంచి వచ్చే సమస్యలు, బాల్య వివాహాల నియంత్రణ, ఇతర మహిళా సంక్షేమ అంశాలను వివరించనున్నట్లు తెలిపారు. అవసరమైన సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 1098, 181, 1930, 14446 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. బాలబాలికలకు సమాన హక్కులు ఉంటాయని, ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మొబైల్ వాడకాన్ని తగ్గించి చదువు, కెరీర్ మీద దృష్టి సారించాలని తెలిపారు. ఉన్నత స్థానాల్లో నిలిచి ఊరికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు. సమావేశంలో డీసీపీవో మహేశ్, జయరాజ్, మమత, రాణి, సాగర్, కస్తూరిబా విద్యాలయం, జూనియర్ కళాశాల ఉపాధ్యాయలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు



గుర్తింపు కార్డు ఇస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రె

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రె తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమాధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఇద్దరు ట్రాన్స్ జెండర్లకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 24 మంది ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తులు చేసుకోగా వాటిని పరిశీలించి ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్షేత్రస్థాయి అధికారి పీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి



ఆదివాసీ నాయకులతో ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌రూరల్: ఆదివాసీ గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివాసీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మారుమూల ఆదివాసీ గ్రామాల్లో ప్రజలకు అన్ని రంగాల్లో పట్టు ఉండాలని ఈ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తే మంచి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. మత్తు పదార్థాల జోలికి పోవద్దని, గంజాయి, కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసుశాఖ తరపున సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అడవిలో చెట్లు నరకడం, అటవీ జంతులను వేటాడటం నేరమని సూచించారు. అనంతరం ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాజకీయ నాయకులను శాలువాలతో సన్మానించారు.

కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఉద్యోగం చేస్తూ మృతి చెందిన, మెడికల్ ఇన్‌వ్యాలిడేట్ అయిన ఉద్యోగుల వారసులకు శనివారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో కైరిగూడ ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎనిమిది మంది కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను అధికారులు ఇంటర్వ్యూ చేశారు. అభ్యర్థులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పించారు. పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, కైరిగూడ మేనేజర్ ప్రవీణ్‌ఫాటింగ్, డీవైపీఎం వేణు, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

శ్యామప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిది



శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సమైక్య భారతావని కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు, జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామప్రసాద్ ముఖర్జీ త్యాగం మరువలేనిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతిని శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావుతో కలిసి శ్యామప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఏక్ పేడ్ మాకే నామ్ అనే కార్యక్రమంలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీ శ్రేణులు శ్యామప్రసాద్ ఆశయ సాధనకు అంకిత భావంతో ముందుకు సాగాలన్నారు. మాజీ ఎంపీపీ మల్లిఖార్జున్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీధర్, జిల్లా ఉపాధ్యక్షులు ఖాండ్రె విశాల్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు జయరాజ్, నాయకులు శ్రీనివాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటిన సిబ్బంది

కాగజ్‌నగర్‌రూరల్: ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, డిపార్టుమెంట్ ఆఫ్ బోటనీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ, దేవేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలి



నూతన కమిటీతో నాయకులు

వాంకిడి: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని సరాండి టోల్‌ప్లాజాలో పని చేస్తున్న కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోల్‌ప్లాజాలో పని చేస్తున్న ప్రతీ కార్మికుడికి రూ.26 వేల వేతనం చెల్లించాలని ఈఎస్ఐ, పీఎఫ్‌లు జమ చేయాలని డిమాండ్ చేశారు. జీతభత్యాల్లో తేడాలు లేకుండా ఒకే రకమైన వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంద్రా, కార్యదర్శి రాకేశ్, కోశాధికారి శశికుమార్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వెలిశాల కృష్ణామాచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.